క్లుప్తంగా

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఆత్మకూరు : ఆర్థిక బాధలు తాళలేక జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన మండలంలోని నీరుకుళ్ల శివారులోని కందిబండలో చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కందిబండకు చెందిన అర్షం నవీన్(48) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈనెల19వ తేదీన పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆదివారం అక్కడి నుంచి మళ్లీ ఎంజీఎం తరలిస్తున్న క్రమంలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వంగపహాడ్‌లో.. ఆటో డ్రైవర్..

హసన్‌పర్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుటుంబ సభ్యులు హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం వంగపహాడ్‌కు చెందిన ఆటో డ్రైవర్ దోమ ఏలియా (55) వారం రోజుల క్రితం ఆరెపల్లి నుంచి వంగపహాడ్‌కు ఆటోలో ఇంటికి బయల్దేరాడు. జాతీయ రహదారి సమీపంలో రోడ్డు దెబ్బతిని ఉండడంతో ఆటో అదుపుతప్పగా ఏలియాకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఏలియా (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నడికూడ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన మండల కేంద్రంలోని బస్టాండ్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన మహ్మద్ సమీర్ తన తండ్రితో కలిసి బైక్‌పై కమలాపూర్ నుంచి నీరుకుళ్లకు వస్తున్నాడు. ఈ క్రమంలో నడికూడ బస్టాండ్ శివారులోని కెనాలపై వద్దకు చేరుకోగా ఒక్కసారిగా సైక్లిస్ట్ ఎదురయ్యాడు. దీంతో ఇరు వాహనాలు ఢీకొనగా సమీర్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం పరకాలలోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

నక్క స్నేహలతకు సన్మానం

హన్మకొండ కల్చరల్: హనుమకొండ గోకుల్‌నగర్‌కు చెందిన నక్క స్నేహలతకు ఇటీవల జాతీయ ఉత్తమ బోధన -2025 అవార్డు లభించింది. ఆమె నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ కొండాపూర్, హైటెక్ సిటీ సంస్థలో సీనియర్ ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ మేరకు వేయిస్తంభాల దేవాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన బతుకమ్మ ఉత్సవాల ప్రారంభోత్సవం కార్యక్రమంలో స్నేహలతను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, తదితరులు ఘనంగా సన్మానించారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి అభినందన

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్ చెందిన మల్లోజు సత్యనారాయణ, రోజా దంపతులు కుమార్తె మల్లోజు ప్రద్యుతి.. సింగరేణి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించారు. ఈ మేరకు ఆమెను సామాజిక వేత్త మేరుగు అశోక్, తదితరులు ఆదివారం అభినందించారు. వైద్య చదువుకు తనవంతం సహాయ సహకారాలు అందిస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. విద్యార్థినులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసి అరుణ, మెరుగు సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రైనింగ్ సెంటర్‌లో యువ వికాస్ భారత్

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లోని రైల్వే ట్రైనింగ్ సెంటర్‌లో కాజీపేట బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయ నిర్వాహకురాలు శ్రీదేవి ఆధ్వర్యంలో నషా ముక్త్ యువ వికాస్ భారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని చేపట్టిన ఈ కార్యక్రమంలో విదేశీ వస్తువులను స్వీకరించం.. స్వదేశీ వస్తువులనే ఉపయోగిస్తాం.. వ్యసనాల జోలికి పోము అనే అంశాలపై 100మందితో ప్రతిజ్ఞ చేయించినట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిలో పాల్గొన్నారు.

ఒక్కేసి పువ్వేసి చందమామ..



కమలాపూర్ : బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు, చిన్నారులు



వేలేరులో..



ధర్మసాగర్‌లో..



బతుకమ్మతో మహిళలు



శాయంపేటలో..



ఐనవోలు : ఆంజనేయస్వామి ఆలయం వద్ద..



పరకాలలో..



నడికూడలో..



ఐనవోలులో..



కమలాపూర్ : దేశరాజుపల్లిలో..

శాయంపేట : మండలంలో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను శివమార్కండేయ, మత్స్యగిరిస్వామి ఆలయాల వద్ద, వివిధ గ్రామాల్లోని ఆయా ఆలయాల వద్ద ఘనంగా నిర్వహించుకున్నారు. సీఐ రంజిత్‌రావు, ఎస్సై పరమేశ్, ఏఎస్సై కుమారస్వామి బందోబస్తు నిర్వహించారు.

పరకాల : బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ పరకాల పట్టణంలోని శ్రీకుంకుమేశ్వరస్వామి, శ్రీచెన్న కేశవస్వామి దేవస్థానం వద్ద మహిళలు ఎంగిలిపూల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూరు : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేశారు.

కమలాపూర్ : మండలంలో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. 'బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో..' అంటూ సందడి చేశారు.

ఐనవోలు : మండలంలో ఎంగిలిపూల బతుకమ్మ సంబురాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మహిళలు ఉదయం నుంచి తంగేడు, గునుగు, బంతి, చామంతి, మందార, సీతజడ, గుమ్మడి తదితర పూలను సేకరించి బతుకమ్మ పేర్చి పసుపు గౌరమ్మను ఇంట్లో ఘనంగా పూజించారు. సాయంకాలం బతుకమ్మ ఆటలతో సందడి చేశారు.

ధర్మసాగర్ : మండల వ్యాప్తంగా ఆదివారం బతుకమ్మ సంబురాలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలకు మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి సాయంత్రం ఆయా గ్రామాల్లోని దేవాలయాలు, బొడ్రాయిల వద్ద వేడుకలు నిర్వహించారు.

దామెర : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఎంగిలి పూల బతుకమ్మను మహిళలు ఆదివారం ఘనంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో సంప్రదాయరీతిన బతుకమ్మను పేర్చి పసుపుతో గౌరమ్మను తయారుచేసి పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామాల ముఖ్య కూడళ్లకు బతుకమ్మలతో చేరుకొని పాటలు పాడుతూ కోలాటం ఆడి సందడి చేశారు.

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు, చిన్నారులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి సాయంత్రం బతుకమ్మ ఆడి సంబురాలు జరుపుకొన్నారు.

నడికూడ : మండలంలో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకొన్నారు. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో సందడి చేశారు.

వేలేరు : మండల వ్యాప్తంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా జరుపుకొన్నారు. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి పాటలు పాడుతూ సందడి చేశారు.

బడుగుల ఆశాజ్యోతి లక్ష్మణ్‌బాపూజీ



ఆత్మకూరు : లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



శాయంపేట : లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శాయంపేట : మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర, ప్రాంత పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సామల మధుసూదన్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వంగరి సాంబయ్య కొండా లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కొండా లక్ష్మణ్ బాపూజీ కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసాని చంద్రప్రకాశ్, రంగు శ్రీధర్, గుండా రమేశ్, బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, రవీందర్, అశోక్, చంద్రమౌళి, రాజయ్య, సంపత్, వెంకటేశ్వర్లు, మురళి, మధుసూదన్, శ్రీనివాస్, మహేందర్, సత్యం, భాస్కర్, ఉపేందర్, శివ, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో ఆదివారం కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల కోశాధికారి ప్రసాద్, గ్రామ ప్రధానకార్యదర్శి కేదారి, పద్మశాలి యూత్ అధ్యక్షుడు రంజిత్‌కుమార్, యూత్ ప్రధాన కార్యదర్శి రవి, రవి, భిక్షపతి, సుదర్శన్, సదానందం, దశరథం, రాజు, రాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై ఆరోపణలు మానుకోవాలి



ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఆరోపణలు చేస్తే సహించేదిలేదని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండాల క్రాంతికుమార్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంఘాల చైర్మన్ అని చెప్పుకుంటున్న మాదాసి సురేష్ కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం తగదని హితవుపలికారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీల మార్గదర్శకాలతోనే ఇళ్లు మంజూరు చేసినట్లు చెప్పారు. పాడి గేదెలను విజయ డెయిరీ ద్వారా ఇచ్చినట్లు తెలిపారు. తమ ప్రమేయం లేకున్నా కావాలని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు రమణారెడ్డి, నాయకులు అశోక్, మాజీ ఉపసర్పంచ్ సుగుణాకర్, ప్రవీణ్, నవీన్, మాధవ్, కౌశిక్, నగేష్ పాల్గొన్నారు.

కంకర పోశారు.. బీటీ మరిచారు

- ఎమ్మెల్యే చెప్పినా ప్రారంభం కాని పనులు
- దుమ్ముతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వేములపల్లి నుంచి కన్నారం వెళ్లే దారిలో పోసిన కంకర

వేలేరు : మండలంలోని పీచర శివారు వేములపల్లి నుంచి కన్నారం వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు రెండేళ్లు గడుస్తున్నా పూర్తికావడం లేదు. కంకర పోసి బిల్లులు రావడం లేదని సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణ పనులు మధ్యలోనే వదిలేశాడు. దీంతో రెండేళ్ల నుంచి కంకర రోడ్డుపై ప్రయాణించాలంటే నరకయాతన అనుభవించాల్సి వస్తుందని వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కన్నారం గ్రామం గతంలో హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలంలో ఉండేది. జిల్లాలు, మండలాల పునర్విభజనతో కన్నారం గ్రామం నూతనంగా ఏర్పడిన వేలేరు మండలంలో కలిసింది. అప్పటి నుంచి గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతూ గుంతల రోడ్డుపై ప్రయాణం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపనతో సరి..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేములపల్లి నుంచి కన్నారం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.4 కోట్ల 35 లక్షల నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రోడ్డుపై కంకర పోసి బిల్లులు రావడం లేదని పనులను మధ్యలోనే వదిలేశాడు. దీంతో గ్రామం నుంచి మండల కేంద్రానికి, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రవాణా కష్టాలు తప్పడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే కడియం చెప్పినా..

వేములపల్లి నుంచి కన్నారం వరకు వెళ్లే బీటీ రోడ్డు పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వచ్చే విధంగా చూస్తానని, బీటీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలని రెండు నెలల క్రితం వేములపల్లిలో జరిగిన సమావేశంలో సంబంధిత కాంట్రాక్టర్‌కు ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ ఇచ్చినా కాంట్రాక్టర్ ఇప్పటికీ బీటీ రోడ్డు పనులు మొదలు పెట్టలేదని స్థానికంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యే విధంగా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



వేములపల్లి నుంచి కన్నారం వరకు ఏన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. రెండేళ్ల క్రితం బీటీ రోడ్డు పనులు ప్రారంభించి మట్టిరోడ్డుపై కంకర పోసి వదిలేశారు. రోడ్డుపై కంకర తేలి ఉండటంతో ఆదారి గుండా ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అలాగే కంకర రోడ్డు కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు, అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలి.

- సమ్మయ్య, వేములపల్లి

సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాట్లు ఉండాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



పశువుల సంత, దామెర చెరువు కట్ట వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి, అధికారులు

పరకాల : తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా బతుకమ్మ పండుగ ఏర్పాట్లు ఉండాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం పట్టణ కేంద్రంలోని పశువుల అంగడి , దామెర చెరువు వద్ద జరుగనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. బతుకమ్మ , దసరా ఉత్సవాలకు వేలాది మంది ఆడపడచులు హాజరుకానున్న నేపథ్యంలో తాగునీరు, పారిశుద్ధ్యం, లైటింగ్ వ్యవస్థ, భద్రత సదుపాయాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. ఆర్డీఓ డాక్టర్ నారాయణ, ఏసీపీ సతీశ్‌బాబు, శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ రాజేశ్వర్‌రావు, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

- ఎమ్మెల్యే సత్యనారాయణ రావు



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : నిరుపేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరంగా నిలుస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 49 మంది లబ్ధిదారులకు రూ. 15 లక్షల 58 వేల విలువచేసే చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. మెరుగైన వైద్యం పొందేందుకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. అనంతరం మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన మారెపల్లి ప్రమీల ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



మాట్లాడుతున్న ఎస్సై విఠల్

పరకాల : నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమని ఎస్సై విఠల్ అన్నారు. స్వేరోస్ సహకారంతో యువ వైద్యులు పట్టణంలోని స్వర్ణగార్డెన్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ.. ఆర్థికం, అక్షరం, ఆరోగ్యం నినాదంతో ఒక నూతన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా స్వేరోస్ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ చంద్రమోహన్, స్వేరోస్ నాయకులు శ్రీనివాస్, సుభద్ర, చక్రి, రాజు, రవి, అర్జున్, డాక్టర్ గణేశ్, డాక్టర్ నిహారిక, డాక్టర్ దివ్య, డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి

- ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఆత్మకూరు : తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల బస్సు యాత్ర ఆదివారం రాత్రి ఆత్మకూరుకు చేరుకోగా ఆత్మకూరు, దామెర మండల ఉద్యమకారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారుల స్థితిగతులను తెలుసుకునేందుకు వెంటనే కమిటీ ఏర్పాటు చేసి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రజనీకాంత్, ఉమ్మడి జిల్లా కార్యదర్శి సదానందం, ఆత్మకూరు మండల అధ్యక్షుడు బాబుమియా, మండల ప్రధాన కార్యదర్శి రాజయ్య, రవీందర్, లక్ష్మీనారాయణ, రజనీకర్, కుమారస్వామి, అశోక్, స్వామి, దశరథం, జనార్దన్ రెడ్డి, రవి, నర్సయ్య ,లక్ష్మారెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు, యూత్ సభ్యుల ఔదార్యం



బియ్యం అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్, యూత్ సభ్యులు

కమలాపూర్ : మండలంలోని దేశరాజుపల్లి అనుబంధ గ్రామం పిట్టలపల్లికి చెందిన లావుడ్య కమలమ్మ ఇటీవల పాముకాటుతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న స్థానిక ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ ఉప్పల్ యూత్ సభ్యులతో కలిసి బాధిత కుటుంబానికి సాయం అందించారు. శనివారం సాయంత్రం ఉప్పల్ యూత్ సభ్యులతో కలిసి పిట్టలపల్లికి బయలుదేరగా అటువైపు సరైన మార్గం లేకపోవడంతో ఓ ట్రాక్టర్‌ను ఇన్‌స్పెక్టర్ స్వయంగా నడిపారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి 75 కిలోల బియ్యాన్ని అందించారు. గ్రామానికి రోడ్డు సదుపాయం లేదని నిత్యావసర సరుకుల కోసం, పిల్లలు బడికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. నాగరాజు, రాణాప్రతాప్, వెంగళకుమార్, శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ సుభాష్, సోను, అఖిల్, మహేందర్, అజయ్, రాకేష్, నిఖిల్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం కలిగిఉండాలి

- జాతీయ సేవా పథకం రాష్ట్ర పరిశీలకుడు నర్సింహులుగౌడ్



మాట్లాడుతున్న నర్సింహులుగౌడ్

దామెర : విద్యార్థులు సేవాభావం కలిగిఉండాలని జాతీయ సేవా పథకం రాష్ట్ర పరిశీలకుడు నర్సింహులుగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని ఒకేషనల్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని ఆదివారం రెండోరోజు కాకతీయ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్, ప్రొఫెసర్ ఈసం నారాయణతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు సేవాభావం కలిగి ఉండాలని అన్నారు. తరగతి గదులకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం కోఆర్డినేటర్ నారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకే ఎన్ఎస్ఎస్ దోహద పడుతుందని అన్నారు. సమావేశంలో మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ మద్దిలేటి పసుపుల, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ దివాకర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు బాబురావు, అధ్యాపకులు రాజ్ కుమార్, మహేందర్, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు పాఠశాల ఆవరణలో వలంటీర్లు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు.

కేడీసీ విద్యార్థికి టీసీఎస్‌లో ఉద్యోగం

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో బీసీఏ విద్యార్థి గోనె కార్తీక్.. ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ టీసీఎస్‌లో ఉద్యోగం సాధించారని కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ అనిల్‌కుమార్ తెలిపారు.